వీసీ నిత్యానందరావుకు సన్మానం

దుండిగల్,అక్టోబర్21: తెలుగుయూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ నిత్యానందరావును సోమవారం బాచుపల్లిలోని యూనివర్సిటీ ప్రాంగణంలో సిబ్బంది,ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా శాలువాలు కప్పి,బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా అరబ్షా బాబా సందల్

బాలానగర్, అక్టోబర్ 21 : ఫతేనగర్ డివిజన్ పరిధి శోభనకాలనీలో అరబ్షా బాబా సందల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ హాజరై అరబ్షా బాబా దర్గాను సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గా వద్ద వారు మైనార్టీలతో కలిసి ప్రార్థనలు చేశారు.

కౌన్సిలర్ జ్యోత్స్న రాజీనామా

రాజీనామా పత్రాన్ని కమిషనర్ శ్రీహరికి అందజేస్తున్న కౌన్సిలర్ జ్యోత్స్న

కుత్బుల్లాపూర్,అక్టోబర్21: కొంపల్లి మున్సిపాలిటీ పరిధి 11వ వార్డుకు చెందిన కౌన్సిలర్ జ్యోత్స్న శివారెడ్డి తన పదవీకి రాజీనామా చేశారు. సోమవారం తన రాజీనామా పత్రాన్ని పార్టీ శ్రేణులతో కలిసి కమిషనర్ శ్రీహరికి తన కార్యాలయంలో కలిసి అందజేశారు. జ్యోత్స్నశివారెడ్డి తెలంగాణ హయర్ ఎడ్యుకేషన్ కమిషన్ మెంబర్‌గా ఎంపిక కావడం పై త్వరలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో నిబంధనల మేరకు ప్రస్తుతం కొనసాగుతున్న తన కౌన్సిలర్ పదవీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ జ్యోత్స్న శివారెడ్డిని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కొంపల్లి అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్,సీనియర్ నాయకులు జెమ్మి దేవేందర్, శివకుమార్, సన్న శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదిన వేడుకలు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్,అక్టోబర్21: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలి వచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత,మాజీ సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళా నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

కేపీహెచ్‌బీ కాలనీ: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద జన్మదినం సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు గజమాలతో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, పార్టీ శ్రేణులు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ మహిళా నేతలు, కార్యకర్తలు

శుభాకాంక్షలు తెలుపుతున్న మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజుయాదవ్, భూరంపేట్ కౌన్సిలర్ సర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

పాలిటెక్నిక్ విద్యార్థులకు శిక్షణ

మియాపూర్, అక్టోబరు 21: మెదక్ పట్టణంలోని ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన సివిల్ ఇంజినీరింగ్ కోర్సు మూడో సంవత్సరం విద్యార్థినులు ప్రాక్టికల్ నైపుణ్యం కోసం చందానగర్ సర్కిల్‌కు వచ్చారు. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారుల నిర్మాణం, యూజీడీ, బాక్స్ నాలాల నిర్మాణ పనులను ఏఈల తోడ్పాటుతో క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన నోట్స్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. కాగా కార్యాలయంలో ఈఈ కేవీఎస్ఎన్ రాజు సదరు విద్యార్థినుల బృందానికి రహదారుల నిర్మాణాలకు సంబంధించి అనుసరించే పద్ధతులు వినియోగించే వనరులు, వాటి నాణ్యతపై తర్ఫీదునిచ్చే అంశాలను బోధించారు. ప్రతిష్టాత్మక జీహెచ్ఎంసీలో తమ ప్రాక్టికల్స్ ప్రాజెక్టుకు హాజర వటం ఎంతో గొప్పగా అనిపిస్తున్నదని , అధికారులు తమకు ఇంజినీరింగ్ అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు

ఆలయాలపై దాడులకు నిరసనగా ర్యాలీ

ప్రగతినగర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న హిందూ సంఘాల ప్రతినిధులు

దుండిగల్,అక్టోబర్ 21: రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై జరుగుతున్న వరుస దాడులకు వ్యతిరేకంగా సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి వద్ద నిరసన తెలుపుతున్న హిందువులపై పోలీసుల అమానుష దాడికి నిరసనగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి, ప్రగతినగర్‌లో సోమవారం హిందూ సంఘాలు ర్యాలీ చేపట్టాయి. హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్న మతోన్మాదులను వెంటనే శిక్షించాలని, దేవాలయాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి దేవాలయాలను రక్షించాలని నినాదాలు చేశారు. దాడి జరిగిన ప్రతిసారి నిందితులపై పిచ్చోళ్లనే ముద్రవేసి దుండగులను కాపాడాలని ప్రభుత్వ పెద్దలు, పోలీసులు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. హిందువులంతా ఏకమై సనాతన ధర్మ పరిరక్షణకు పాటు పడాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రగతి నగర్ అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి మొదలైన ర్యాలీ ఏనుగుబొమ్మల చౌరస్తా, కోతులబొమ్మల చౌరస్తా, నెమలి బొమ్మల చౌరస్తా మీదుగా బతుకమ్మ ఘాట్ వరకు కొనసాగింది. అల్లూరి, భగత్‌సింగ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ర్యాలీలో డా.ఎమ్ ఆర్ఎస్ రాజు, నాగిశెట్టి శేషారావు, రచ్చ చక్రధర్, రామచంద్ర నాయక్, సత్యనారాయణ, విజయ్, ధనంజయ్, కౌశిక్ నాయుడు, గోపి, రామనారాయణ, దాట్ల వెంకటపతి రాజు,శ్రీనివాస్, భరత్‌ముఖ్, ప్రవీణ్, వర్మ,బాబు,నాగేశ్వర్‌రావు,శ్రీనివాస్,కిశోర్,సాయికిరణ్,కిరణ్,జనార్దన్‌రెడ్డి, మురళి,హరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్, అక్టోబర్21: డివిజన్‌లో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహాబేగం గుత్తేదారులకు సూచించారు. అల్లాపూర్ డివిజన్ పరిధి సబ్దర్‌నగర్‌లో రూ. 40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక నేతలతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారంతో డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలలో తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, గ్రేవ్ యార్డులు అధునాతన వసతులతో అభివృద్ధి పరుచుకున్నామన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, మోయిజ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుపరాడ్ పడి బాలుడు మృతి

అల్లాపూర్, అక్టోబర్ 21: నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి ఇనుపరాడ్ పడి ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం ...బీదర్‌కు చెందిన ఓ కుటుంబం మూడు రోజుల క్రితం అల్లాపూర్‌కు వచ్చింది. ఈ క్రమంలో వారి కుమారుడు ఇమ్రాన్(6) అల్లాపూర్ ఆర్‌కేసొసైటీలో నిర్మాణంలో ఉన్న భవనం ముందు ఆడుకుంటున్నాడు. అదే సమయంలో పై నుంచి ఇనుప రాడ్ బాలుడి తలపై పడి తీవ్ర రక్త స్రావమైంది. వెంటనే బాలుడిని స్థానిక అసుపత్రికి తరలించగా.. చిత్రపొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 21 : బాలాజీనగర్ డివిజన్‌లోని స్వాన్‌లేక్ అపార్ట్‌మెంట్‌లో శ్రీ వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం ఆదివాస హోమం, చతుర్థి రోహిణి నక్షత్రయుక్త వృశ్చికలగ్న ముహూర్తమున శ్రీ విఘ్నేశ్వర యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ కలశ ప్రతిష్ఠాపనం, పూర్ణాహూతి, పండిత ఆశీర్వచనము పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. ప్రజలందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు, స్వాన్‌లేక్ అపార్ట్‌మెంట్స్ సభ్యులు కోరారు.

విశ్వకర్మలు కళాకృతులకు ప్రతీకలు

విశ్వకర్మలు తయారు చేసిన నాగలిని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

బాలానగర్, అక్టోబర్ 21 : విశ్వకర్మలు కళాకృతులకు ప్రతీకలుగా నిలువడం ప్రశంసనీయమని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలోని ఎంఎస్ఎంఈ కార్యాలయం ఆడిటోరియం హాలులో ఏర్పాటు చేసిన పీఎం విశ్వకర్మ యోజన ట్రైనింగ్, ఎగ్జిబిషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వకర్మలు తయారు చేసిన వివిధ కళాకృతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మలు పలు కళారూపాలు తయారు చేసి జీవం పోస్తారని పేర్కొన్నారు. విశ్వకర్మలకు ఉన్న ప్రత్యేకత వర్ణణాతీతం అన్నారు. విశ్వకర్మలు చేతి వృత్తులపై ఆధారపడి జీవనాధారం పెంపొందించుకుంటారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మలు తదితరులు పాల్గొన్నారు.

రావల్‌కోల్ ఇండస్ట్రీయల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉపేందర్‌రెడ్డి

గీతానగర్–రావల్‌కోల్ మైక్రో ఇండస్ట్రీయల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కల్లు ఉపేందర్‌రెడ్డి విజయం సాధించారు. సోమవారం గీతానగర్‌లోని ఉపేందర్‌రెడ్డి నివాసం వద్ద బాలానగర్ మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య ఉపేందర్‌రెడ్డితో పాటు ఇతర కమిటీ సభ్యులను కలిసి పూలబొకే అందించి శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి కె. సంతోష్, చంద్రపాల్, రాజు, సతీశ్, విశ్వనాథ్, రేణు తదితరులు పాల్గొన్నారు.

–బాలానగర్, అక్టోబర్ 21 :

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 21 : కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 23 ఫిర్యాదులు వచ్చినట్లు జడ్సీ అపూర్వ్ చౌహాన్ తెలిపారు. సోమవారం ప్రజావాణిలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 21 ఫిర్యాదులు, ఇంజినీరింగ్ విభాగానికి 8 ఫిర్యాదులు, ఎల్లక్ట్రికల్ విభాగానికి 3 ఫిర్యాదులు, శానిటేషన్ విభాగానికి 1 ఫిర్యాదు అందింది. కాగా... ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి... ఆయా సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని జడ్సీ సంబంధిత అధికారులను ఆదేశించారు.

జంట సర్కిళ్లలో 8 ఫిర్యాదులు..

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 8 ఫిర్యాదులు వచ్చినట్లు డీసీలు రమేశ్, కృష్ణయ్య తెలిపారు. కూకట్‌పల్లి సర్కిల్‌లో రెండు ఫిర్యాదులు రాగా... టౌన్‌ప్లానింగ్ విభాగాని 2 ఫిర్యాదులు వచ్చాయి. మూసాపేట సర్కిల్‌లో 6 ఫిర్యాదులు రాగా... టౌన్‌ప్లానింగ్ విభాగానికి 6, రెవెన్యూ విభాగానికి 1, ఎల్లక్ట్రికల్, శానిటేషన్ విభాగానికి 1 ఫిర్యాదులు వచ్చాయి. ఆయా ఫిర్యాదులను పరిశీలించి... చర్యలు తీసుకుంటామని డీసీలు తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చందానగర్ సర్కిల్ కార్యాలయంలో...

మియాపూర్: చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. డీసీ మోహన్‌రెడ్డి పలు విభాగాల అధికారులతో కలిసి ప్రజా వినతులను స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 7 ఫిర్యాదులు రాగా అందులో 4 రెవెన్యూ విభాగం, రెండు ఇంజినీరింగ్, ఒకటి పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి వచ్చాయి. హుడా కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురైందని, గంగారం జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న ఆర్ఎస్ బ్రదర్స్ మాల్ ఎదుట డబ్బా కొట్లు వేయించి కిరాయిలు వసూలు చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలకు మాల్ కారణమవుతున్నదని బీఆర్ఎస్ నాయకులు మిద్దెల మల్లారెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అధికారులు ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా డీసీ మోహన్‌రెడ్డి ప్రజావాణి ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో తగిన తనిఖీలు చేపట్టి చర్యలు చేపట్టాలని, ఎటువంటి నిర్లక్ష్యం వహించొద్దని అధికారులకు సూచించారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

మూసాపేట, అక్టోబర్21: గ్రూప్–1 ఉద్యోగాల భర్తీకి సోమవారం నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్న పరీక్షలు మొదటి రోజు సజావుగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పరీక్ష కొనసాగింది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవినాశ్ కాలేజ్‌లలో పరీక్షలు నిర్వహించారు. సంబంధిత కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించారు. కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా పరిధిలో 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాలలో 17,762 అభ్యర్థులు పరీక్షకు హాజరు కానునట్లు తెలిపారు. పరీక్ష గదులను, సీసీ కెమెరాల డిజిటల్ వాచ్‌ల ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. దివ్యాంగులైన అభ్యర్థులకు సహాయంగా ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులను అందుబాటులో ఉంచామన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజన వసతి కూడా కల్పిస్తున్నామని తెలిపారు.

కుత్బుల్లాపూర్: బాలానగర్, మేడ్చల్ జోన్ల పరిధిలో సోమవారం గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. డీసీపీలు కోటిరెడ్డి, సురేశ్‌కుమార్‌ల నేతృత్వంలో ఆయా పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా బందోబస్తు చేపట్టారు. ఐడీపీఎల్‌లోని రెయిన్‌బో కళాశాలలో ఉన్న సెంటర్‌ను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్త సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 8 పరీక్ష సెంటర్లు ఉండగా 5160 మంది అభ్యర్థులకు గాను 3761 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా మరో 1399 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

క్యూలో నిల్చుని సెంటర్‌లోకి వెళ్తున్న అభ్యర్థులు

ఐడీపీఎల్ రెయిన్‌బో కళాశాలలోని సెంటర్‌ను పరిశీలిస్తున్న మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా తదితరులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 21 : కూకట్‌పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చైతన్య ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంగీత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సంగీత్‌నగర్ కాలనీ పరిసర ప్రాంతాలు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 3 వరకు మాధవరం హైట్స్ రోడ్డు, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

మహిళ అదృశ్యం

లక్ష్మమ్మ(ఫైల్)

మాదాపూర్: మానసిక పరిస్థితి సరిగా లేని మహిళ ఇంట్లో నుంచి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరా నగర్‌కు చెందిన లక్ష్మమ్మ (59) ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు ఆమె కుమారుడు డ్యూటీ ముగించుకొని వచ్చి చూడగా తన తల్లి ఇంట్లో కనిపించలేదు. కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 27853911, 8712510404, కంట్రోల్ రూం నంబర్ 100, 040 27853408 గల నంబర్‌లను సంప్రదించగలరని కోరారు.

ఓంకార్‌కు నివాళి

మియాపూర్, అక్టోబరు 21 : ఎంసీపీఐ వ్యవస్థాపక నేత మద్దికాయల ఓంకార్ 16 వ వర్ధంతి కార్యక్రమాన్ని మియాపూర్ నడిగడ్డ తండాలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నేతలు నివాళులర్పించారు. పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఓంకార్ నిరంతర పోరాటం చేశారని తెలిపారు. నర్సింహ, పార్టీ గ్రేటర్ నాయకుడు రమేశ్ , దశరథ్, లక్ష్మి, నర్సింహ, గౌసియా, ఖైరున్నీసా బేగం, చాన్‌బీ, జేబునీషా పాల్గొన్నారు.

విద్యార్థుల ఆందోళన

ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మూసాపేట, అక్టోబర్21: కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎటువంటి సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం విద్యార్థులను మోసం చేస్తున్నదని అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్ విద్యార్థులు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒకేషనల్ కోర్సులలో భాగంగా పారామెడికల్‌లో ఒక్కో విద్యార్థి నుంచి యాజమాన్యం రూ. 50 వేల నుంచి లక్ష రుపాయలు వసూలు చేసి కాలేజీ ప్లేస్‌మెంట్ చూపిస్తామని కాలేజీలో చేర్చుకున్నారన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎటువంటి సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు రోడ్డున పడ్డారన్నారు. కాలేజీకి ఎటువంటి రిజిస్ట్రేషన్ లేదన్న విషయం తెలుసుకున్న విద్యార్థులు కళాశాల యాజమాన్యాన్ని సంప్రదించగా ఎటువంటి సమాధానం ఇవ్వకపోవడంతో సోమవారం విద్యార్థులు కళాశాల యాజమాన్యాన్ని తమ డబ్బులు, సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వమని ఆందోళనకు దిగడంతో యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థులు పోలీస్ స్టేషన్ ఆవరణలో బైటాయించి తమ సర్టిఫికెట్లు, డబ్బులు తిరిగి ఇవ్వాలని పోలీసులను కోరారు.

కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన

ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

దుండిగల్,అక్టోబర్21: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్,బాచుపల్లిలోని నారాయణ రెసిడెన్షియల్ బాలికల కళాశాల వద్ద సోమవారం ఉదయం ఉద్రిక్తత చోటుచేసుకుంది.కళాశాలలో ఇంటర్మీడియట్ (ఎంపీసీ) మొదటి సంవత్సరం చదువుతున్న సంగారెడ్డి జిల్లా, జహీరాబాద్‌కు చెందిన సిరిపురం లక్ష్మయ్య కూతురు అనూష(17) అనుమానాస్పద స్థితిలో ఆదివారం సాయంత్రం కళాశాల వసతిగృహం గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో సోమవారం కళాశాల వద్ద బాలిక తల్లిదండ్రులు,కుటుంబ సభ్యులతో పాటు వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆందోళనకు దిగారు. కళాశాల యాజమాన్యం వేధింపుల వల్లనే తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు కళాశాల ఎదుట బైఠాయించడంతో యాజమాన్యం నుంచి సరైన స్పందన లేకపోవడంతో కళాశాల అద్దాలను పగులగొట్టారు. మరోవైపు వివిధ విద్యార్థి సంఘాల నేతలు సైతం అనూష కుటుంబానికి కళాశాల యాజమాన్యం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టాయి. బాచుపల్లి పోలీసులు సీఐ ఉపేందర్,డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ తిమ్మప్ప,ఇతర పోలీస్‌సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పారు. కళాశాల యాజమాన్యం మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి పరిహారం అందించేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించారు.

IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT AT HYDERABAD
O.S.No. 4814 of 2024
Between:
Masroor Fathima. ...Plaintiff
AND
The Tahsildar, Shaikpet Mandal, Hyderabad.
All concerned ...Defendants
To All concerned
Please take notice that the plaintiff has filed the suit O.S.No. 4814 of 2024 to declare the plaintiff is the legal heir of Late Mohammed Ghousuddin. The said suit is posted to 18-11-2024 for appearance in the said Court at 10.30 a.m. in default, the matter will be taken up for hearing and decided ex-parte in your absence. This notice is issued as per the direction of the Hon'ble Court Dated 15-10-2024.
//BY ORDER OF THE COURT//
Sd/- P.S.R. CHANDRA MURTHY (Sreeram), Advocate
Flat No. 101, Kala Nilayam, H.No. 16-10-27/46/6, 80/2RT, Behind Yashoda Hospitals, MCH Colony, Malakpet, Hyderabad-500 036,
M.No. 7396827347.